క్లుప్తంగా

'ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే విమర్శలు'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు అనవసర విమర్శలు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ చర్చ అంటూ మీడియా అటెన్షన్ కోసం ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయక కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేసే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రతీ విషయాన్ని చర్చిద్దామని ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు లాలమున్నా, మయూర్ చంద్ర, ఆకుల ప్రవీణ్, విజయకుమార్, రాజేష్, కరుణాకర్ రెడ్డి, రమేష్, జోగు రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వీడ్కోలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి బదిలీ అయ్యారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులు ఆయనను శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీవో స్వప్నశీల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

ఓటర్ల జాబితా సవరణపై అవగాహన


మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్ కుమార్

ఆదిలాబాద్‌రూరల్: ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా సవరణపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ ఆర్డీవో బి.వినోద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఎల్వోలు ఓటర్ల జాబి తాలో కొత్తగా పేర్ల నమోదు, వలసవెళ్లిన, మరణించిన వారి పేర్ల తొలగింపు, మార్పులు చే ర్పుల ఫారంపై అవగాహన కలిగి ఉండాలన్నా రు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోవింద్, డిప్యూటీ తహసీల్దార్ సాయిమహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


ప్లేట్లు, పలకలు అందజేస్తున్న ఈశ్వరిబాయి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పిప్పల్‌ధరి సెక్టార్ పరిధిలో గల దహిగూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి మంగళవారం తనిఖీ చేశారు. పిల్లల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. చిన్నారుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూశారు. అనంతరం తన భర్త కుమ్ర రాజు 3వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం కుమ్ర రాజు, ఈశ్వరి బాయి ఫౌండేషన్ తరఫున అంగన్‌వాడీ పిల్లలకు పలకలు, ప్లేట్లు అందజేశారు. సీడీపీవో వనజ, సూపర్‌వైజర్ రూపావతి, అంగన్‌వాడీ టీచర్ రత్నమాల ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య మరింత పెంచాలి


అధ్యాపకులతో డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్

ఇచ్చోడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా చూడాలని డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్ అన్నారు. ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించి అధ్యాపకులతో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య పెంచడంతోపాటు వారి వందశాతం హాజరు ఉండేలా చూడాలన్నారు. ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు ఉన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి జరిమానా

బోథ్: సొనాల మండలం గుట్ట పక్కతండాకు చెందిన మట్టచందర్ సింగ్ గతంలో దేశీదారు విక్రయిస్తూ అనేకసార్లు పట్టుబడ్డాడని ఎక్సైజ్ సీఐ జుంఫికర్ అహ్మద్ తెలిపారు. బైండోవర్ ఉల్లంఘించి దేశీదారు విక్రయించడంతో ఆయనకు రూ.50 వేల జరిమానా విధించి మంగళవారం చలానా కట్టించినట్లు పేర్కొన్నారు.

వానాకాలంలో గోస


నక్కలవాడ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వాగు (ఫైల్)

- నక్కలవాడ వంతెన నిర్మించేదెన్నడు ?
- భారీ వర్షాలకు నిండుతున్న కరత్వాడ ప్రాజెక్టు
- రోడ్లపై చేరుతున్న వరద
- గ్రామాలకు రాకపోకలు బంద్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

బోథ్: వానాకాలం వస్తేచాలు మండలంలోని నక్కలవాడ, కొత్తపల్లె, రేండ్లపల్లె, లక్ష్మీపూర్ గ్రామప్రజలు వణికిపోతున్నారు. నక్కలవాడ గ్రామానికి వెళ్లే వంతెన ప్రమాదకరంగా మారింది. కరత్వాడ ప్రాజెక్టు వెనక వైపు గ్రామం ఉంటుంది. నక్కలవాడతోపాటు ఆదివాసీ గ్రామాలైన లక్ష్మీపూర్, కొత్తపల్లె, రేండ్లపల్లె గ్రామాలు ఉంటాయి. గ్రామాలకు వెళ్లడానికి గతంలో లోలెవల్ వంతెన నిర్మించారు. భారీ వర్షాలకు కరత్వాడ ప్రాజెక్టు పూర్తిగా నిండిపోతుండటంతో బ్యాక్‌వాటర్ వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. రోడ్లపై వరదనీరు చేరడంతో గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతేడాది కురిసిన వర్షాలకు దాదాపు 20 రోజుల పాటు వంతెనపై వాగు ప్రవహించింది. అయితే ప్రతి వర్షాకాలంలో దాదాపు రెండు నెలలపాటు వంతెనపై వాగు ప్రవహిస్తూ ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మండల కేంద్రానికి రావడానికి గ్రామస్తులు తాడు సహాయంతో వంతెనను దాటుతూ వస్తున్నారు. మర్లపెల్లిలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లాలంటే విద్యార్థులు తాడు సహాయంతోనే వెళ్లాల్సిన పరిస్థితి. గత ఆరేళ్ల క్రితం ఇద్దరు వంతెన దాటుతుండగా కొట్టుకుపోయి మృతి చెందిన ఘటనలు చోటు చేసుకున్నాయి. కాగా, పశువులు వాగులో కొట్టుకుపోతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా నక్కలవాడ వంతెన నిర్మాణం నోచుకోవడం లేదు.

పనులు పూర్తిచేయాలి

రెవెన్యూ గ్రామమైన ధన్నూర్(బి) ఆనుకుని ఉన్న వాగుపై ఉన్న వంతెన లోలెవల్ వంతెనపై వర్షం పడిన ప్రతిసారి వాగు ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధన్నూర్‌తోపాటు నాగాపూర్ గ్రామాలకు రాకపోకలు బంద్ నిలిచిపోతున్నాయి. మండల కేంద్రానికి, చేలల్లోకి వెళ్లిన వారు వంతెనపై నుంచి పారే వాగును దాటలేకపోతున్నారు. దీంతో వాగు ఉధృతి తగ్గేవరకు అక్కడే వేచి చూడాల్సిన పరిస్థితి. గతంలో వంతెన దాటే క్రమంలో చిక్కుకున్న గ్రామస్తులను పోలీసులు తాడు సహాయంతో రక్షించారు. అయితే, తమకు ఎత్తైన వంతెన నిర్మించాలని వారు కోరుతున్నారు. ఇటీవల వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇంకా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాగు దాటలేకపోతున్నాం



నక్కలవాడ వద్ద కరత్వాడ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వంతెనపై నుంచి ప్రవహించడంతో వంతెన దాటలేకపోతున్నాం. అత్యవసర పరిస్థితిలో వాగును ప్రాణాలను పణంగా పెట్టి దాటాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివాసీ గ్రామాలకు హైలెవల్ వంతెన నిర్మించాలి. – కొడప విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్, నక్కలవాడ

వైఎస్సార్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న శ్రీకాంత్ రెడ్డి, తదితరులు


నేరడిగొండలో..


బోథ్‌లో..


ఆదిలాబాద్: కేక్ కట్ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఆదిలాబాద్‌రూరల్: మరణం లేని మహనీయుడు దివంగత నేత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మావలలోని ఆయన నివాసంలో వైఎస్సార్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంక్షేమ పథకాలతో పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రూపేష్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, కోఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, యువజన కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షులు రంజిత్ రెడ్డి, మావల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, మండల అధ్యక్షులు గౌతమ్, ఆఫ్సర్ ఖాన్, రాజన్న, వెంకటేశ్, దినేష్, అక్షయ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మహానేత దివంగత సీఎం వైఎస్సార్ పేదల గుండెల్లో ఇప్పటికీ పదిలంగా ఉన్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు వసంత్ రావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పోతారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు హీరా సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, ఆత్మ డైరెక్టర్లు స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్: పేదల గుండెచప్పుడు వైఎస్సార్ అని ఆయన అభిమాని అల్లం మనోహర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ అన్నారు. సొనాల పీహెచ్‌సీలో అల్లం మనోహర్‌తో పాటు వైద్యులు నవీన్‌రెడ్డి, సిబ్బంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఆదిలాబాద్: మహానేత వైఎస్సార్ అని వైఎస్సార్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఆసీఫ్ కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. షేక్ అస్లాం, ఎండీ.రఫీ, జబీర్, సయ్యద్ అర్సలాన్ పాల్గొన్నారు.

జీవో 49 రద్దు చేయాలని లేఖలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల హక్కులు హరించేలా ఉన్న జీవో 49ను రద్దుతోపాటు గోండిభాషను రాజ్యాంగంలో చేర్చడం, గోండి ధర్మకోడ్ గుర్తించాలని రాజ్‌గోండ్ సేవా సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆ సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ల జిష్ణు దేవ్ వర్మకు ప్రత్యేక లేఖలు పంపించారు. అటవీ శాఖ అధికారులు రెవెన్యూ భూమిలో, ఆదివాసీ గ్రామాల్లో అడుగుపెట్టద్దన్నారు. రోడ్లు, బ్రిడ్జిలు పాఠశాలలు అంగన్‌వాడీ భవన నిర్మాణాలు అడ్డుకోవద్దని తెలిపారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులు మంజూరు చేయాలని విన్నవించారు. గోండి పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు.

హజ్‌యాత్రకు దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్: పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లాలనుకునే ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకోవాలని సొసైటీ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహమ్మద్ తవక్కల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2026 సంవత్సరానికి గాను ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. యాత్రకు వెళ్లాలనుకునే వారు తమ వివరాలను ఈనెల 31లోపు సొసైటీ కార్యాలయంలో అందించాలని సూచించారు. సమావేశంలో మహమ్మద్ ఆసిఫ్ ఉద్దీన్, మహమ్మద్ అబ్దుల్ హసీబ్, తదితరులు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న డాక్టర్ రిమాండ్

ఇచ్చోడ: యువతిని వేధిస్తున్న మెడికల్ ఆఫీసర్‌ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇచ్చోడలోని టీచర్స్ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్ కూతురును డాక్టర్ సయ్యద్ ఆసిమ్ వేధింపులకు గురిచేస్తున్నాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గతంలో ఆయనపై కేసు నమోదు చేయగా, సయ్యద్ ఆసిమ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

విధులకు ఆటంకం కలిగించిన నలుగురి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: నేరడిగొండ మండలంలోని జాతీయ రహదారిపై గతనెల 26న రాస్తారోకో నిర్వహించి పోలీసులపై దాడిచేసి విధులను ఆటంకం కలిగించిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేయగా, మంగళవారం నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. మామడ మండలం గాయద్‌పల్లి చెందిన జాదవ్ ప్రేమ్‌సింగ్, ఇందల్ ఇస్లావత్, బ్రహ్మావత్ అరవింద్, జాదవ్ లక్ష్మణ్‌ను ఉట్నూర్ కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉట్నూర్ ఎస్సైగా ప్రవీణ్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఎస్సైగా ప్రవీణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పొన్నం సాయి, సూర్యకాంత్, కిరణ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

నేరడిగొండ ఎస్సైకి సన్మానం

నేరడిగొండ: నేరడిగొండ ఎస్సైగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ఇమ్రాన్ ఖాన్‌ను యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి మంగళవారం సన్మానించారు. మండల యూత్ అధ్యక్షుడు హీరాసింగ్, బోథ్ బ్లాక్ ఆత్మ డైరెక్టర్లు స్వామి, శంకర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

జైనథ్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సోషల్ సెక్యూరిటీ డీపీఎం సామ వకుల అన్నారు. ఇందిరమ్మ మండల సమైక్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. రుణాలు తీసుకుని వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని రాణించిన మహిళలను సన్మానించారు. ఏపీఎం భగవండ్లు, సీసీలు శ్రీనివాస్‌రెడ్డి, వాసురెడ్డి, లక్ష్మి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

నార్నూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ సంఖ్యను పెంచాలని డిప్యూటీ సెక్రటరీ ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల తరగతి గదులు, ఆవరణ పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశాలు నిర్వహించి కళాశాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ కేవీ కేశవులుతోపాటు వెంకటరమణ, బాలాజీ కాంబ్లే ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

బజార్‌హత్నూర్: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐఈడీఎస్ ఎకనామికల్ కోఆర్డినేటర్ నిఖిలేష్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గిర్నూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిక్షాకాలనీకి చెందిన ఈర్ల సృజనిత– రాజు దంపతుల పిల్లలు సహర్ష్, అద్విత్రీ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం కేఆర్‌కే కాలనీలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు భోజనం పెట్టారు. అలాగే నోటు పుస్తకాలు, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య, పాఠశాల హెచ్ఎం షేక్ అలీ పాల్గొన్నారు.

గుండం ఆడుతూ...గుండెపోటుతో ఒకరి మృతి

సిరికొండ: మొహర్రం సందర్భంగా సరదాగా సవారీ గుండం ఆడుతూ హఠాత్తుగా గుండెపోటుకు గురై ఒకరు మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన ఎగ్గిడి నడ్పి మల్లేశ్ (50) సోమవారం మొహరం సందర్భంగా రాత్రి సవారీ వద్ద గుండం ఆడుతూ గుండెపోటుకు రావడంతో వెంటనే స్థానికులు 108 వాహనంలో ఇచ్చోడ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గతంలో వార్డు మెంబర్‌గా, పాఠశాల చైర్మన్‌గా గ్రామానికి సేవలందించారు.

వైద్యశిబిరం

బజార్‌హత్నూర్: భూతాయి(కే) గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 60 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ కుర్సింగే భీంరావ్ తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ అభిశేక్, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, ఏఎన్ఎంలు అన్నపూర్ణ, శ్రీలత పాల్గొన్నారు.

నేటి సమ్మెను విజయవంతం చేయాలి

ఇచ్చోడ: నేడు జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మిక సంఘాలు విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కార్మికులు, రైతులు, ఈ సమ్మెలో అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆటోలకు స్కానర్ స్టిక్కర్లు

ఇంద్రవెల్లి: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై ఇ.సాయన్న అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో మంగళవారం మై ఆటో షేక్ కార్యక్రమం నిర్వహించి 150 ఆటోలకు వాహనదారుల భద్రతకు సంబంధించిన స్కానర్ స్టిక్కర్లు అతికించారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి

- జీసీడీవో మెస్రం ఛాయా


విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఛాయా

నార్నూర్: ఆశ్రమ పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జీసీడీవో మెస్రం ఛాయా అన్నారు. మండలంలోని మాన్కాపూర్ బాలికల ఆశ్రమ, దిశ మోడల్, జామ్‌డా, నార్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. విద్యార్థులకు నిర్వహించిన అభ్యసన సామర్థ్య పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా ఏ,బీ,సీ,డీ గ్రూప్‌లుగా విభజించాలన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాలతో ఐటీడీఏ పరిధిలో ఉన్న పాఠశాలలో 'అక్షర జ్యోతి' కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారిలో అభ్యాసన సామర్థ్యాలు పెంచేందుకు ఎంతోగానో దోహదపడతాయన్నారు. ఆమె వెంట హెచ్ఎంలు జాదవ్ విఠల్, మెస్రం ధన్ను, వనిత, విశ్వనాథ్, చౌహాన్ సుభాస్ తదితరులు ఉన్నారు.

అటవీ అధికారులను అడ్డుకున్న రైతులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగాపూర్ గ్రామంలో అటవీ భూముల్లో మంగళవారం మొక్కలు నాటడానికి వెళ్లిన బీర్సాయిపేట అటవీ రేంజ్ అధికారి అరుణ సిబ్బందిని రైతులు పెట్రోల్ బాటిల్‌తో అడ్డుకున్నారు. ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూముల్లో మొక్కలు ఎలా నాటుతారని ప్రశ్నించారు. దీంతో రైతులకు అటవీ అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎఫ్ఆర్‌వో అరుణ మాట్లాడుతూ తాము మొక్కలు నాటేది అటవీ భూమి అని, రెవెన్యూ భూమి కాదన్నారు. మీ వద్ద ఏవైనా రికార్డులు చూపించాలని రైతులకు సూచించారు. కాగా, పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు.

ఆలోచింపజేసిన నాటిక


ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

కైలాస్‌నగర్: హైదరాబాద్‌కు చెందిన ఆర్ట్స్ అభ్యుదయ కళాబృందంతో అంబేద్కర్ జీవిత చరిత్ర అని తెలియజేసేలా 'బుద్ధుడితో నా ప్రయాణం' పేరిట ప్రదర్శించిన నాటిక అందరిని ఆలోచింపజేసింది. పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ ప్రదర్శనను ఎమ్మెల్యే పాయల్ శంకర్, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి తిలకించారు. కళాకారులు గౌతమబుద్ధుడు, డాక్టర్ అంబేద్కర్ జీవిత చరిత్రను చాటిచెప్పేలా ప్రదర్శించిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. డీఎస్‌డీఓ సునీతకుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌రావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వోలే కీలకం


మాట్లాడుతున్న యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి: ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వోలే కీలకమని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. నేషనల్ బీఎల్‌వోల ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల బీఎల్‌వోలకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా గుర్తింపు వచ్చేలా బీఎల్‌వోలు పనిచేయాలన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, తుకారం, ఎంపీడీవో భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి


బెడ్‌షీట్లు అందజేస్తున్న అధికారి తిరుపతి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఉష్కం తిరుపతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశానికి హాజరయ్యారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు కార్పెట్లు, బెడ్‌షీట్లు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. సెక్టోరియల్ అధికారులు రఘురమణ, సుజాత్ ఖాన్, ప్రత్యేక అధికారి ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు గణేశ్, శకుంతల, హారిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి


మాట్లాడుతున్న మనోహర్

నార్నూర్: రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. నార్నూర్ పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కార్యక్రమాల పనితీరు, రికార్డులను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి జితేంద్ర రెడ్డి, వైద్యుడు సుంకన్న, హెచ్ఈవో రాథోడ్ తులసిదాస్, నాందేవ్, చరణ్‌దాస్ చౌహాన్, లక్ష్మి సుశీల, సత్యవ్వ తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని, రాష్ట్ర ప్రజలకు అండగా ఉండాలని ఆ భగవంతున్ని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

యూరియా కోసం ధర్నా

బోథ్: యూరియా కొరత ఉందంటూ సొనాల మండల కేంద్రంలో రైతులు మంగళవారం రోడ్డుపై బైఠాయించారు. మరోవైపు ఓ దుకాణంలో యూరియా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. యూరియా కొరత లేదని వ్యవసాయాధికారి రవితేజ తెలిపారు. ఎక్కువ ధరలకు విక్రయించిన దుకాణంలో విచారణ చేపడతామన్నారు.

ఇచ్చోడ ఎంపీడీవోగా ఆనంద్

ఇచ్చోడ: ఇచ్చోడ ఎంపీడీవోగా ఆనంద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన లక్ష్మణ్ సొంత జిల్లా నిజామాబాద్‌కు బదిలీ కాగా, ఎంపీవో ఆనంద్‌కు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

గిరిజన యువకుడికి సేవారత్న పురస్కారం


పురస్కారం అందుకుంటున్న మారుతీ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలం చించుఘాట్‌కు చెందిన కాత్లే మారుతీ హైదరాబాద్‌కు చెందిన కళామందిర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే సేవారత్న పురస్కారానికి ఎంపికయ్యాడు. పీవీటీజీ తోటికొలాం తెగకు చెందిన ఆయన వ్యవసాయం చేస్తూనే తాను నేర్చుకున్న విలువిద్యపై గత 16 ఏళ్లుగా బాల, బాలికలకు ఉచిత శిక్షణతో ఎంతో మందిని జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాడు. మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన కార్యక్రమంలో రూ.50వేల నగదుతోపాటు సేవారత్న పురస్కారాన్ని అందుకున్నాడు.